సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 15 । అక్టోబర్ । 2025



చెరువు మట్టిపై కన్ను

చెరువులపై కూటమి నేత కన్ను పడింది. పంట పొలాల్లో వేసుకునేందుకు అనుమతులు తీసుకుని 100 టిప్పర్ల మట్టి తవ్వి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. -IIలో



ఉద్యోగి ఇంటి వద్ద హిజ్రా నిరసన

ఆర్థిక లావాదేవీల్లో భాగంగా తనకు డబ్బు, బంగారం ఇవ్వకుండా మోసం చేశాడని హిజ్రా ఓ ప్రైవేట్ ఉద్యోగి ఇంటి వద్ద నిరసనకు దిగింది. -IIలో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.200	రూ.240
రెండోరకం	రూ.140	రూ.190

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 137 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	610	610
బైవోల్టిన్	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 93.800 కిలోలు

న్యూస్‌రీల్

ఒంటిమిట్ట హుండీ ఆదాయం లెక్కింపు



నగదు లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

ఒంటిమిట్ట: ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం ఆలయ టీటీడీ అధికారులు లెక్కించారు. సెప్టెంబర్ 10 నుంచి అక్టోబర్ 14 వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కింపు చేశారు. ఆలయ రంగమండపంలో ఈ కార్యక్రమం జరిగింది. హుండీల ద్వారా ఆదాయం రూ.7,45,356 వచ్చినట్లు అధికారుల వెల్లడించారు.

మామిడి రైతులకు ఆర్థిక సాయం

రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని 2271 మంది మామిడి రైతులకు ఆర్థిక సాయం కింద రూ.9.8 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. టన్నుకు నాలుగు వేల రూపాయల చొప్పున 22706 టన్నుల తోతాపూరి మామిడి కాయలకు సంబంధించిన డబ్బులను రైతుల ఖాతాలలో ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా రైల్వేకోడూరు, చిట్వేలి, రాజంపేట, పీలేరు, రాయచోటి, మదనపల్లి మండలాల రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. తోతాపురి మామిడి రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే ఫోన్ నంబర్ :8919527578కు సంప్రదించవచ్చని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుభాషిణి పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను గెస్ట్‌ఫ్యాకల్టీ పద్ధతిలో బోధించడానికి ఈనెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ సునీల్‌బర్నబాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. అలాగే డిగ్రీ ఉర్దూ మీడియంలో చదివిన వారు లేక డిగ్రీలో ఉర్దూ లాంగ్వేజి చదివి ఉన్న అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల వారు కళాశాల కార్యాలయ పనిదినాల్లో దరఖాస్తులను అందజేయాలన్నారు. ఈనెల 21వ తేదీ ఇంటర్వ్యూ ఉంటుందని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తమ వెంట విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలని సూచించారు. రాష్ట్రంలో ఏ ప్రాంతానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. నెలకు 27 వేల రూపాయల వేతనం ఉంటుందని వివరించారు.

నాలుగు మండలాల్లో వర్షం



కడప అగ్రికల్చర్: ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లాలో నాలుగు మండలాల్లో వర్షం కురిసింది. ఇందులో భాగంగా జమ్మలమడుగులో 16.4 మి.మీ, మైలవరంలో 15.6 మి.మీ, పోరుమామిళ్లలో 1.2 మి.మీ, రాజుపాలెంలో 1 మి.మీ వర్షం కురిసింది.

సీపీఆర్‌పై అవగాహన అవసరం



సీపీఆర్ విధానంపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్ఓ నాగరాజు

కడప రూరల్: ప్రజలు సీపీఆర్ విధానంను నేర్చుకొని ఎదుట వ్యక్తి ప్రాణాలను కాపాడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాణరక్షణ మన కర్తవ్యం అనే నినాదంతో కార్యాలయ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవనశైలి విధానంలో ఎన్నో మార్పులు సంభవించాయన్నారు. అందులో భాగంగా ప్రమాదవశాత్తు జరిగే సంఘటనల కారణంగా ఊపిరి ఆగిపోవడం, తీవ్ర అనారోగ్యానికి గురి కావడం తదితర ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. ఈ అవగాహన కార్యక్రమాలను ఈనెల 17వ తేదీ వరకు అన్ని ప్రాథమిక, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ లలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ సునీల్, జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కృష్ణ చైతన్య, డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, డాక్టర్ రవికుమార్, డీఎంఓ మనోరమ, డెమో భారతి తదితరులు పాల్గొన్నారు.

సీజ్‌తో సరి.. చర్యలేవి మరి?


- తంబళ్లపల్లెలో అక్రమంగా స్టోన్ క్రషర్ ఏర్పాటు
- నేతను టీడీపీ సస్పెండ్ చేయడంతో క్వారీ సీజ్
- గతంలో సహకరించిన కొందరు అధికారులు
- బాగోతం బయటపడుతుందనే భయంతో వెనకడుగు



క్వారీలో జేసీబీ ద్వారా చేపడుతున్న పనులు (ఫైల్)



ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన స్టోన్‌క్రషర్



సాక్షి, అమరావతి: అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని యాదలగుట్టపై అక్రమ స్టోన్ క్రషర్ నడుపుతున్నారని సీజ్ చేసిన అధికారులు.. దానిపై చర్యలు చేపడితే తమకు ఇబ్బందులు తప్పవని.. ఇందులో నుంచి బయటపడేందుకు తంటాలు పడుతున్నారు. అధికారం అండతో అధికారులు అక్రమాలకు వత్తాసు పలికి, ప్రస్తుతం ఏం చర్యలు తీసుకుంటే ఏం జరుగుతుందో అని గప్‌చుప్ అయిపోయారు. ప్రత్యేకించి విద్యుత్ సరఫరా లైను వేసి సహకరించిన డిస్కం అధికారులు దీనిపై నిశ్శబ్దం అయ్యారు.

పనులు జరుగుతున్నా పట్టించుకోని శాఖలు

తంబళ్లపల్లి నియోజకవర్గం తుమ్మనంగుట్ట వద్ద క్వారీ కోసం టీడీపీ మాజీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఐదు ఎకరాల క్వారీకి ఆయన పేరిట రెవెన్యూ శాఖ ఎన్‌ఓసీ ఇచ్చింది.. కానీ, మైనింగ్ నుంచి అనుమతి లేదని అధికారులు స్పష్టం చేశారు. కోట్ల విలువైన సామగ్రిని తరలించి స్టోన్ క్రషర్‌ను ఏర్పాటు చేసి, పనులు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు.. దీన్ని ప్రారంభించిన తర్వాతనే స్పందించారు. అందులోనూ జయచంద్రారెడ్డిని టీడీపీ నుంచి సస్పెన్షన్ చేసిన రెండు రోజుల తర్వాత. దీన్ని బట్టి అధికారులు అధికార పార్టీలో ఉన్నందున చర్యలు తీసుకునేందుకు జంకారని అర్థం అవుతోంది. అయితే స్టోన్‌క్రషర్ ఎవరి పేరుతో ఉందో స్పష్టత లేదు. సీజ్ చేసినప్పుడు టీడీపీ నుంచి సస్పెన్షన్ అయిన జయచంద్రారెడ్డిదని మైన్స్ అధికారులు ప్రకటించారు. తర్వాత ఆయన బావమరిది గిరిధర్‌రెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి స్టోన్‌క్రషర్, భవనాలను నిర్మించారని చెప్పారు. దీనితో జయచంద్రారెడ్డి పేరుతో స్టోన్‌క్రషర్ లేదని సమాచారం. స్టోన్‌క్రషర్‌ను ప్రభుత్వ గయాళు భూమిలో ఏర్పాటు చేశారని రెవెన్యూ అధికారులు గుర్తించారు.

ప్రమాదకర బోర్ బ్లాస్టింగ్


క్వారీకి మైనింగ్ అనుమతి లేకపోయినా.. దర్జాగా క్వారీ బండరాళ్ల బ్లాస్టింగ్ జరిగింది. సాధారణ బ్లాస్టింగ్ వల్ల రైతుల పొలాలు, సమీపంలోని ఇళ్లకు నష్టం వాటిల్లుతుంది. బోర్ బ్లాస్టింగ్ అంటే ఇంకా ప్రమాదం. భూమి కంపిస్తుంది, చాలా దూరంలోని ఇళ్లు కూడా బీటలు బారుతాయి. దీనికి అనుమతి లేకపోయినా బోర్ బ్లాస్టింగ్ చేశారని తెలుస్తోంది.

అనుమతి లేకుండానే..

స్టోన్‌క్రషర్‌ను సీజ్ చేసిన శాఖలు అంతటితోనే సరిపెట్టాయి. క్వారీ బ్లాస్టింగ్ ద్వారా ఎంత కంకర వినియోగించారు అనే లెక్కలను మైన్స్ అధికారులు అంచనా వేసి.. విజయవాడ మైనింగ్‌శాఖకు నివేదించాక చర్యలు ఉంటాయట. బ్లాస్టింగ్ చేయడం, ప్రభుత్వ భూముల ఆక్రమణ, అనుమతి లేని కార్యకలాపాల నిర్వహణ, విద్యుత్ సరఫరా లైను ఏర్పాటు ఇవన్నీ అనుమతి లేకుండా జరిగాయని అధికారులే ప్రకటించారు.

డిస్కం అధికారుల సాహసం

స్టోన్‌క్రషర్ పని చేసేందుకు అవసరమైన విద్యుత్ కోసం డిస్కం అధికారులు సరఫరా ఇవ్వడం సాహసమని అధికారులే అంటున్నారు. సౌకర్యాలు కల్పించాలంటే అనుమతులను సమర్పించాలి. వాటి ఆధారంగా శాఖల అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే వీటిని పట్టించుకోని డిస్కం అధికారులు.. ప్రశ్నించే వారు లేరు అన్నట్టుగా ప్రత్యేకంగా విద్యుత్ సరఫరా లైను ఏర్పాటు చేశారు. ఇందులో ఉన్నతాధికారుల ప్రమేయం కనిపిస్తోంది.



స్టోన్‌క్రషర్‌కు వేసిన విద్యుత్ లైన్

బాధ్యులు అధికారులే

స్టోన్‌క్రషర్ నిర్వహణ విషయంలో అధికారులే బాధ్యులు అవుతారని వారిలో ఆందోళన నెలకొంది. చర్యలతో ముందుకు వెళ్తే.. ఇంత కాలం ఎందుకు పట్టించుకోలేదు, చర్యలు ఎందుకు తీసుకోలేదు అని ఉన్నతాధికారుల నుంచి తమపై శాఖాపరమైన చర్యలు ఉంటాయని, తామే బాధ్యత వహించాల్సి ఉంటుందనే ఆందోళనలో ఉన్నారు. సీజ్‌తో వదిలేస్తే చర్యల నుంచి బయటపడొచ్చన్న ఆలోచన అధికారుల్లో ఉంది.

ప్రధాని సభకు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలో ఈనెల 16న ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సభకు పరిశ్రమల యజమానులు హాజరుకావాలని జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం చాంద్‌బాషా ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటలకు జరిగే సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ సభకు జిల్లాలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల యజమానులు, పారిశ్రామికవేత్తలు, పరిశ్రమల సంఘ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

మోదీ సభకు 3300 ఆర్టీసీ బస్సులు



కడప కోటిరెడ్డి సర్కిల్: ప్రధాని నరేంద్రమోదీ కర్నూలు జిల్లా పర్యటన నేపథ్యంలో ఆయన నిర్వహించే సభకు రాయలసీమ జిల్లాల నుంచి 3300 ఆర్టీసీ బస్సులు నడపనున్నారు. తిరుపతి నుంచి 320, చిత్తూరు 280, అన్నమయ్య 225, వైఎస్సార్ 340, నంద్యాల 310, కర్నూలు 225, అనంతపురం 225, శ్రీ సత్యసాయి జిల్లా నుంచి 260 బస్సులు వెళ్లేలా ప్రణాళికలు రూపొందించారు.

16న ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప కార్పొరేషన్: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16న గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి వి. శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు జి. మధుకుమార్, ఏ. శ్రీనివాస బాబు, విజయలక్ష్మి పాల్గొని వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరిస్తారన్నారు. వినియోగదారులకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ఈ ప్రత్యేక ఆదాలత్‌కు హాజరై పరిష్కరించుకోవాలని సూచించారు.

ఉన్నత స్థాయికి చేరుకోవాలి



కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్

ఓబులవారిపల్లె: విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థాయికి చేరాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అన్నారు. మంగళవారం చిన్నఓరంపాడు కస్తూర్బా గాంధీ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం బి.కమ్మపల్లి గ్రామంలో అరటి రైతులు కలెక్టర్‌కు తమ గోడు వెళ్లబోసుకున్నారు. అరటి ధరలు తీవ్రంగా పడిపోయాయని, పెట్టిన పెట్టుబడి కూడా రావడం లేదని, దీంతో తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు. తదుపరి కలెక్టర్ అరటి, బొప్పాయి పంటలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తహసీల్దార్ యామినిరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు ముక్కా సాయి వికాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒప్పందంలో ఏ తప్పు దాగుందో!

- కడప రిమ్స్ లో ఆక్సిజన్ సరఫరా' కాంట్రాక్ట్ వ్యవహారంలో 'గోల్ మాల్'!
- అధికార దర్పంతో అగ్రిమెంట్ రద్దుచేసి.. ఆపై మరో సంస్థకు కట్టబెట్టిన వైనం
- అగ్రిమెంట్ దక్కించుకున్న ఏజెన్సీపై పలు ఆరోపణలు, కేసులు నమోదు



కడప రిమ్స్ ఓపి విభాగం

సాక్షి,టాస్క్ ఫోర్స్: కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో రోగుల వైద్యం కోసం ఉపయోగించే ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా కాంట్రాక్ట్ వ్యవహారంలో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. తోచిన రీతిలో అగ్రిమెంట్లు చేసుకుంటూ నిబంధనలకు నీళ్లొదులుతున్నారు. వివరాల్లోకి వెళితే..

జిల్లాలోని ఎర్రగుంట్లకు చెందిన వారాశి సంస్థకు 2015 నుంచి 2020 వరకు రిమ్స్‌కు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కాంట్రాక్ట్ ఇచ్చింది. అనంతరం మూడేళ్లు, ఆపై ఒక్కో ఏడాది పొడిగిస్తూ 2025 వరకు ఒప్పందం కొనసాగించారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది జూలై 22న వారాశి సంస్థకే మరో ఏడాది రెన్యూవల్ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీని ప్రకారం 2026 వరకు సదరు సంస్థకు ఒప్పందం ఉంది. తెరవెనుక ఏ మతలబు జరిగిందో.. ఏ రాజకీయ ఒత్తిడి ఎక్కువైందో గానీ రెన్యూవల్ ఉత్తర్వులు జారీ చేసిన 4 రోజులకే అంటే జూలై 26నే వారాశి సంస్థతో కుదుర్చుకున్న అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. అదే నెల 30న కర్నూలుకు చెందిన శ్రీ భారత్ ఫార్మా సంస్థతో ఆక్సిజన్ సరఫరా కోసం కొత్త అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. నిజానికి శ్రీ భారత్ ఫార్మా కంపెనీకి 2018లోనే పదేళ్లపాటు రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరా చేసేందుకు టెండర్లు పిలవకుండానే అగ్రిమెంట్ చేశారు. అందులో భాగంగానే 2021లోనే రిమ్స్‌కూ ఆక్సిజన్ సరఫరా చేయాలని శ్రీ భారత్ సంస్థను అధికారులు కోరారు. అప్పట్లో సిలిండర్ల సరఫరా చేయలేయమని శ్రీ భారత్ సంస్థ చేతులెత్తేసింది. దీంతో వారాశికే ప్రభుత్వం ఆక్సిజన్ సిలిండర్ల కాంట్రాక్ట్‌ను పొడిగించింది.

మళ్లీ శ్రీ భారత్ ఫార్మాకే...

తాజాగా రిమ్స్‌కు ఆక్సిజన్ సరఫరా చేసే కాంట్రాక్ట్‌ను శ్రీ భారత్ ఫార్మా వారికి కట్టబెట్టారు. కాగా ఆక్సిజన్ సిలిండర్ల సరఫరా సక్రమంగా చేయకపోవడం వల్ల 23 మంది ప్రాణాలు కోల్పోయారని తిరుపతిలో రుయా హాస్పిటల్ అధికారులు శ్రీ భారత్ ఫార్మాపై ఫిర్యాదు చేశారు. 2021 జూలై 23న ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పట్లో అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాంటి సంస్థకే కడప రిమ్స్ అధికారులు ఆక్సిజన్ సరఫరా కాంట్రాక్ట్‌ను కట్టబెట్టడాన్ని పరిశీలకులు తప్పుబడుతున్నారు. కాంట్రాక్ట్ మధ్యలో 2020 నుంచి 2025 వరకు ఐదేళ్లపాటు సరఫరా చేయలేని సంస్థకు కాంట్రాక్టు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. పైగా దక్షిణ భారతదేశంలోనే ఎక్కువ రేటుతో ఆక్సిజన్‌ను సరఫరా చేసే ఏకైక సంస్థ శ్రీ భారత్ ఫార్మా కంపెనీ కావడం గమనార్హం. మరోవైపు శ్రీ భారత్ ఫార్మా కంపెనీ ఏజెన్సీ విధానాలపై, కర్నూలు అనంతపురం జీజీహెచ్‌లలో జరుగుతున్న అవకతవకలపై ఇప్పటికే విజిలెన్స్ కమిటీతో విచారణ చేయాలని మంత్రి టీజీ భరత్ డిమాండ్ చేయడం గమనార్హం. అవినీతి ఆరోపణలు, కేసులు నమోదైన సంస్థకు, ఎక్కువ ధరకు మరోసారి రెన్యువల్ చేయడం వెనక మతలబు దాగి ఉందని పలువురు ఆరోపిస్తున్నారు.

పైసా వసూల్

నీరుగారుతున్న ఏపీఎండీసీ లక్ష్యం

- ఉచిత విద్య కోసం పాఠశాల స్థాపన
- ఫీజు పెంపు పేరిట వసూళ్లు





మంగంపేట ఏపీఎండీసీ పాఠశాల

ఓబులవారిపల్లె: ఏపీఎండీసీ లక్ష్యం నీరుగారుతోంది. ఉచిత విద్య కోసం స్థాపించిన పాఠశాలలో.. ఫీజులు వసూలు చేస్తుండటంతో ఆ సంస్థ ప్రతిష్ట మసకబారుతోంది. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట బెరైటీస్ గనుల విస్తరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు, ఏపీఎండీసీలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని సంకల్పించింది. ఇందుకోసం ఏపీఎండీసీ సీఎస్ఆర్ నిధులతో మంగంపేటలో ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసింది. నిర్వహణకు గాను ఏటా 2.5 కోట్ల రూపాయలు చెల్లిస్తోంది. ఉపాధ్యాయులు, ఇతర ఆఫీసు ఖర్చులకు ప్రతి నెల 22 లక్షల రూపాయలు ఇస్తోంది. అయితే పాఠశాల నిర్వాహకులు విద్యార్థుల నుంచి ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. దీంతో ఉచితం కాస్తా ఖరీదుగా మారింది. దీనిపై ఏపీఎండీసీ యాజమాన్యం కూడా స్పష్టమైన ప్రకటన చేయకపోవడంతో.. విద్యార్థుల తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు.

రూ.3 వేల ఫీజు పెంపు

ప్రతి విద్యార్థి నుంచి ఏటా ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది రూ.3 వేలు పెంచి వసూలు చేస్తున్నారు. ఇవ్వలేని వారిపై ఉపాధ్యాయుల ద్వారా ఒత్తిడి తీసుకువస్తున్నారు. గతేడాది 6వ తరగతి విద్యార్థికి రూ.9,500 ఫీజు ఉండగా.. ఈ ఏడాది రూ.12500 చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారు. వ్యాన్ ఫీజు అని టీచర్‌లు చెబుతున్నారు. పాఠశాలలో 1150 మంది విద్యార్థులు ఉండగా.. వారి నుంచి మొత్తం రూ. 34 లక్షల 50 వేలు వసూలు చేస్తున్నారు. అన్నింటికి ఏపీఎండీసీ నిధులు ఇస్తుంటే.. నిర్వాహకులు డబ్బులు వసూలు చేయడం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విచారణ చేసి నిగ్గు తేల్చాలి

బస్సులు, డ్రైవర్లు, నాన్‌టీచింగ్ స్టాఫ్ జీతాలు, మధ్యాహ్న భోజనం తదితరాలకు ఏపీఎండీసీ ప్రతి నెల రూ.22 లక్షలు చొప్పున ఏడాదికి 2.5 కోట్ల రూపాయలు యాజమాన్యానికి చెల్లిస్తోంది. 'ఈ మొత్తాన్ని వారు ఎక్కడ ఖర్చు చేస్తున్నారు. తప్పుడు లెక్కలతో స్వాహా చేస్తున్నారు' అని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. మళ్లీ విద్యార్థుల నుంచి డబ్బు వసూలు చేసి, ఎక్కడికి పంపిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఇంటర్, డిగ్రీ చేసిన వారిని ఉపాధ్యాయులుగా నియమించి, తక్కువ జీతాలు చెల్లిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయంటున్నారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి.. నిజాలు వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉచితంగా విద్య అందించాలి



గనుల విస్తరణలో ఇళ్లు, భూములు కోల్పోయిన నిర్వాసితుల పిల్లలకు ఏపీఎండీసీ పాఠశాలలో ఉచితంగా విద్య అందించాలి. ఫీజులు ఎందుకు వసూలు చేస్తున్నారు. ఈ ఏడాది మళ్లీ ఫీజులు పెంచారు. ప్రైవేటు పాఠశాలలు, దీనికి తేడా లేకుండా పోతోంది. ఇలా అయితే నిర్వాసితులు పిల్లలను చదివించడం కష్టం అవుతుంది. -హరిబాబు, ఏపీటీసీ మంగంపేట ఓబులవారిపల్లె

విషయం నా వరకు రాలేదు



పాఠశాలలో ఫీజులు పెంచాలని ఎటువంటి ఉత్తర్వులు రాలేదు. ప్రస్తుతం ఫీజులు పెంచి వసూలు చేస్తున్న విషయం నా దృష్టికి రాలేదు. ఈ విషయంపై పాఠశాల నిర్వాహకులతో మాట్లాడి ఎందుకు ఫీజులు పెంచారో విచారణ చేస్తాను. ఆ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తాను. - గోపినాథ్, సీపీఓ, ఏపీఎండీసీ మంగంపేట

హెడ్ ఆఫీస్ ఆదేశాల మేరకే పెంపు

ఏపీఎండీసీ హెడ్ ఆఫీసు నుంచి సర్క్యులర్ రావడంతో ఫీజులు పెంచడం జరిగింది. ఈ విషయాన్ని పేరెంట్స్ మీటింగ్‌లో చెప్పాం. రూ.2 వేలు స్కూల్‌కు, వెయ్యి రూపాయలు బస్సుకు మొత్తం రూ.3 వేలు పెంచాం. పాఠశాల ప్రారంభమై ఎనిమిదేళ్లు అయిన సందర్భంగా యాజమాన్యం ఫీజులు పెంచింది. - రేవతి, హెడ్ టీచర్, ఏపీఎండీసీ పాఠశాల

కబ్జాకు గురైన భూముల పరిశీలన



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ యామిని రెడ్డి, ఎస్ఐ మహేష్

ఓబులవారిపల్లె : బాలిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను తహసీల్దార్ యామినిరెడ్డి మంగళవారం పరిశీలించారు. బాలిరెడ్డిపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వేనెంబర్‌లు 1293, 1294/1, 1295/1, 2,3,4,5లలో దాదాపు వంద ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని సీపీఐ నాయకులు పలుమార్లు తహసీల్దార్ యామినీ రెడ్డికి ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ మంగళవారం బాలిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలో భూములు, వై.కోట 1155 సర్వే నెంబర్లు దాదాపు 222 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆమె పరిశీలించారు. పూర్తిస్థాయిలో రికార్డులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు అందిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. బీకేఎస్‌యూ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పండుగోల మణి మాట్లాడుతూ 15 రోజులలోగా భూ కబ్జాలను అరికట్టి దళిత గిరిజనులకు పంపిణీ చేయాలని లేనిపక్షంలో భూ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ మహేష్, ఆర్ఐ మల్లికార్జున రెడ్డి, సర్వేయర్ నాగలక్ష్మి, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ, నియోజకవర్గ కార్యదర్శి ఎం.జయరామయ్య, మండల కార్యదర్శి మల్లిక, వెంకటరమణ, గోపాల్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అటవీ భూముల ఆక్రమణను అడ్డుకున్న జనం

మదనపల్లె రూరల్ : మండలంలోని చీకలబైలు పంచాయతీ దొనబైలు మార్గంలో అటవీ భూములను ఆక్రమించి దర్గా నిర్మాణానికి యత్నించిన ఘటనపై కేసు నమోదుచేసినట్లు తాలూకా ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. మదనపల్లె మండలం ఈశ్వరమ్మ కాలనీ, కర్నాటక ముళబాగిలుకు చెందిన వ్యక్తులు సోమవారం దర్గా నిర్మాణం పేరుతో అటవీ ప్రాంతంలో పనులు ప్రారంభించడంతో స్థానిక గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. అర్ధ రాత్రి వరకు తీవ్ర ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. ఫారెస్ట్, పోలీస్ అధికారులు అక్కడకు చేరుకుని ఆక్రమణలు తొలగించి పరిస్థితి చక్కదిద్దారు. వీఆర్వో విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై బయట వ్యక్తులకు సహకరించిన చీకలబైలుకు చెందిన శ్రీనివాసులు, దేవళం వీధికి చెందిన మహమ్మద్ ఖాదిర్, అతడి భార్య సల్మాతో పాటు మరికొందరిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ భార్యా భర్తలు

సుండుపల్లె : మండలంలోని భాగంపల్లి సమీపంలో మంగళవారం ఉదయం రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో భార్య, భర్తలు షేక్‌రహజాన్ (60), షేక్ గఫూర్ (65) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108లో వారిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేసి మెరుగైన చికిత్స కోసం తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు.

బైక్ ఢీకొని మరొకరికి..



గాయపడిన ముని కృష్ణ, వన్నూర్‌స్వామి

ఒంటిమిట్ట : మండల కేంద్రమైన ఒంటిమిట్టలో మంగళవారం సాయంత్రం బైకు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు..ఎర్రగుంట్లకు చెందిన జేసీబీ ఆపరేటర్ వన్నూరు స్వామి(48) రాజంపేటలో పనులు ముగించుకుని తిరిగి పల్సర్ బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం వెనుక వైపు ఉన్న కడప–చెన్నై జాతీయ రహదారిపైకి రాగానే రోడ్డు దాటుతున్న ఒంటిమిట్టకు చెందిన మునికృష్ణ(35)ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వన్నూర్‌స్వామికి స్వల్ప గాయాలవగా, మునికృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ప్రైవేటు వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఎస్సీ ఎస్టీ కేసు నమోదు

కడపఅర్బన్ : కడప నగరం శంకరాపురంలో కులం పేరుతో దూషించిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు తెలిపారు. సీఐ వివరాల మేరకు.. శంకరాపురానికి చెందిన విజయకుమార్ సమీపంలో నివాసమున్న అక్కిశెట్టి వెంకట్ మంగళవారం చిన్న విషయమై గొడవపడ్డారు. దీంతో ఆవేశంతో విజయ్ కుమార్‌ను కులం పేరుతో దూషిస్తూ వెంకట్ దాడి చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని సీఐ తెలిపారు.

చెరువు మట్టిపై కూటమి నేతల కన్ను


మట్టిని తోలుతున్న టిప్పర్

చెరువులపై కూటమి నేత కన్ను పడింది. పంట పొలాల్లో వేసుకునేందుకు అనుమతులు తీసుకుని 100 టిప్పర్ల మట్టి తవ్వి అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని కోనమ్మ చెరువులో మట్టి తరలించేందుకు నీటిపారుదల శాఖ అధికారులు కొన్ని క్యూబిక్ మీటర్ల వరకు అనుమతులు ఇచ్చారు. ఇదే అదునుగా కూటమి నాయకులు పెద్ద ఎత్తున తవ్వి తరలిస్తున్నారు. టిప్పర్‌కు రూ.500 వసూలు చేస్తూ నిత్యం వంద టిప్పర్లకు పైగా మట్టి తరలిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే.. కూటమి నాయకులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. అడ్డు చెప్పిన అధికారులకు పైస్థాయి లీడర్లతో ఫోన్లు చేయించి బెదిరించడం పరిపాటిగా మారింది. ఇలాగే వదిలేస్తే.. పెద్ద ఎత్తున గోతులు పడి రాబోయే వర్షాలకు నీరు చేరి ప్రమాదంగా మారే పరిస్థితి ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – పుల్లంపేట

ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట హిజ్రా నిరసన

లక్షల్లో నగదు, బంగారం తీసుకుని మోసం చేశాడని ఆరోపణ


ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట నిరసన తెలుపుతూ న్యాయంచేయాలని కోరుతున్న స్వాతి.

మదనపల్లె రూరల్ : ఆర్థిక లావాదేవీల్లో భాగంగా లక్షల రూపాయల నగదుతో పాటు బంగారు నగలు, విలువైన ఆస్తి పత్రాలు తీసుకుని ఓ ప్రైవేట్ ఉద్యోగి, అతడి భార్య తనను నిలువునా మోసం చేశారని, అడిగితే ఇవ్వకపోగా..తనను చంపేస్తామని బెదిరిస్తున్నారని హిజ్రా స్వాతి ఆవేదన వ్యక్తం చేసింది. పట్టణంలోని ముజీబ్ నగర్‌లోని ప్రైవేట్ ఉద్యోగి ఇంటి ఎదుట మంగళవారం సాయంత్రం హిజ్రా బైఠాయించి నిరసనకు దిగింది. బాధితురాలి వివరాల మేరకు...పట్టణంలోని చీకలిగుట్ట గౌతమీ నగర్‌లో భర్త దుర్గాప్రసాద్‌తో కలిసి చీటీలు వేసుకుని హిజ్రా స్వాతి జీవనం సాగిస్తోంది. ఐదేళ్ల క్రితం తన స్నేహితురాలు చంద్రకళ..ముజీబ్ నగర్‌కు చెందిన ప్రైవేట్ కాలేజీ క్యాషియర్, వడ్డీ వ్యాపారి ధమరేశ్వర్, అతడి భార్య స్వర్ణలత వద్ద రూ.30 లక్షలు అప్పు తీసుకోగా హిజ్రా స్వాతి పూచీ పడింది. అనంతరం చంద్రకళ వడ్డీ, అసలు కట్టలేక ఐపీ పెట్టి వెళ్లిపోయింది. స్నేహితురాలు చంద్రకళకు పూచీ పడిన స్వాతిని అప్పు చెల్లించాల్సిందిగా ధమరేశ్వర్ దంపతులు ఒత్తిడిచేశారు. ఈ క్రమంలో తన కష్టార్జితంతో పాటు, ఇతరుల నుంచి పెద్ద మొత్తంలో అప్పుచేసి, విడతల వారీగా ఫోన్ పే ద్వారా రూ.34లక్షలు, అకౌంట్ ద్వారా రూ.8లక్షలు, నగదు రూపేణా రూ.23లక్షల90వేలు, 600 గ్రాముల బంగారు ఇచ్చినట్లు స్వాతి తెలిపారు. వ్యడం జరిగిందన్నారు. స్నేహితురాలు చేసిన అప్పును వడ్డీతో సహా చెల్లించినప్పటికీ, తాను వారికి ఇచ్చిన నగదు, బంగారు, ఆస్తి పత్రాలను తిరిగి ఇవ్వాలని అడిగితే.. ఇవ్వకపోగా, వేధింపులకు గురిచేశారన్నారు. టూటౌన్ పోలీసులను ఆశ్రయిస్తే...పోలీసుల ఎదుట ఇచ్చేస్తామని అంగీకరించి అనంతరం మొండికేశారన్నారు. అంగబలం, ఆర్థిక బలాన్ని ఉపయోగించి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాకుండా చేశారని, నగదు, డబ్బులు అడిగితే...రెండు రోజుల క్రితం ఎస్టేట్ సమీపంలో తనపై ధమరేశ్వర్, అతడి భార్య స్వర్ణలత దాడికి పాల్పడ్డారన్నారు. దాడి విషయం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి, సీసీ పుటేజీ ఆధారాలను అందించినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. విధిలేని పరిస్థితుల్లో తనకు అప్పులిచ్చిన వారి నుంచి ఒత్తిడి అధికమవడంతో ధమరేశ్వర్ ఇంటి ఎదుట బైఠాయించినట్లు తెలిపింది. పోలీసులు తనకు న్యాయం చేయాలని కోరింది.

వరకట్నం వేధింపులతో
వివాహిత ఆత్మహత్యాయత్నం

ఆస్పత్రిలో కుటుంబసభ్యుల ఘర్షణ


ఆత్మహత్యకు పాల్పడిన హీనా కౌసర్

మదనపల్లె రూరల్ : వరకట్నం వేధింపులకు ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, జిల్లా ఆస్పత్రి ఆవరణలో ఇరు కుటుంబాల సభ్యులు ఘర్షణకు దిగిన ఘటన మంగళవారం మదనపల్లెలో జరిగింది. బాధితుల వివరాల మేరకు.. పట్టణంలోని మోతీనగర్‌కు చెందిన వసీంకు రామసముద్రానికి చెందిన హీనా కౌసర్(23)ను ఇచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నాడు. పెళ్లి అయిన నెల రోజుల నుంచే అత్తింటివారు అదనపు కట్నం కోసం తరచూ వేధించడం, కొట్టడం, తిట్టడం చేసే వారు. ఈ క్రమంలో మంగళవారం అదనపు కట్నం విషయమై మరోసారి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన హీనాకౌసర్ ఇంట్లో ఉన్న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న ఆమె సోదరుడు మహమ్మద్ ఇర్ఫాన్, మదనపల్లెకు చేరుకుని హీనా కౌసర్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించాడు. భర్త వసీం అడ్డుకోవడంతో ఘర్షణ తలెత్తింది. మహమ్మద్ ఇర్ఫాన్‌పై వసీం కుటుంబసభ్యులు దాడికి దిగారు. అనంతరం హీనా కౌసర్‌ను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. ఆమెను 108 అంబులెన్స్ వాహనంలో ఎక్కిస్తుండగా, హీనా కౌసర్ కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. అక్కడే ఉన్న వసీం కుటుంబ సభ్యులతో గొడవపడి కొట్టుకున్నారు. దీంతో టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితురాలిని తిరుపతికి పంపించి, కుటుంబ సభ్యులను పంపేశారు.

క్యారమ్స్ విజేత తమిళనాడు

నందలూరు : యంగ్ మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారత స్థాయిలో జరిగిన పోటీల్లో డబుల్స్ కేటగిరీలో విజేతగా చెన్నై, రన్నర్స్‌గా కోయంబత్తూరు జట్లు నిలిచాయి. ఈ జట్టు సభ్యులకు రూ.40వేలు, రూ.25వేల నగదు అందజేశారు. సింగిల్స్ కేటగిరీలో మొదటి బహుమతి రూ.25 వేలు, కేరళకు చెందిన నసీర్, ద్వితీయ బహుమతి రూ.15వేల నగదు గుంతకల్‌కు చెందిన పవన్ గెలుచుకున్నారు. సెమీ ఫైనల్, క్వార్టర్ ఫైనల్లో ఓడిన క్రీడాకారులకు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యంగ్‌మెన్స్ క్యారమ్స్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షుడు బీఎస్.శంకర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, పల్లె గ్రీష్మంత్‌రెడ్డి, నాగభూషణం, సుధాకర్, హరిప్రసాద్, నారాయణ, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతి అందుకుంటున్న చెన్నై జట్టు

నవంబర్ 23న జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో నవంబర్ 23న జిల్లా స్థాయి భగవద్గీత పోటీలు నిర్వహించనున్నట్లు టీటీడీ హిందు ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ డాక్టర్ టి.గోపిబాబు, ధర్మాచార్యులు గంగనపల్లె వెంకటరమణ ఓ ప్రకటనలో తెలిపారు. గీతాజయంతిని పురస్కరించుకొని నవంబరు 23న ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభం అవుతాయన్నారు. 6వ తరగతి నుంచి 9వ తరగతి చదివే విద్యార్థినీ, విద్యార్థులకు ఒక విభాగంగా భగవద్గీత 14వ అధ్యాయం గుణత్రయ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు భగవద్గీత 16వ అధ్యాయం దైవాసుర సంపద్విభాగ యోగంపై, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వరకు గల వారికి నిత్య జీవితంలో భగవద్గీత–భావ విశ్లేషణ అంశంపై పోటీలుంటాయని తెలిపారు. ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ గెలుపొందిన వారికి నగదు ప్రోత్సాహాన్ని అందజేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు నవంబర్ 20వతేదీలోగా 9110779066 నెంబర్‌కు కాల్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో నిందితుడికి జైలుశిక్ష


జైలుశిక్ష పడిన నిందితుడు గడ్డం రవి

కేవీపల్లె : ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఓ నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి ఎ.నరసింహమూర్తి తీర్పునిచ్చారని ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. 2018లో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తుండగా అప్పటి కేవీపల్లె ఎస్ఐ కెబి.శివకుమార్ ఐదుగురు నిందితులను పట్టుకుని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదికను తిరుపతి ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టుకు సమర్పించారు. కేసును పరిశీలించిన న్యాయమూర్తి ఎ1 ముద్దాయిగా ఉన్న కలకడ మండలం ముడియంవారిపల్లెకు చెందిన గడ్డం రవికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. జరిమానా చెల్లించని పక్షంలో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తెలిపారు. ముద్దాయికి శిక్ష పడేలా కృషి చేసిన రాయచోటి డీఎస్పీ ఎం ఆర్.కృష్ణమోహన్, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.అమరనారాయణ, అప్పటి ఎస్ఐ కెబి.శివకుమార్, ప్రస్తుత ఎస్ఐ చిన్నరెడ్డెప్ప, సీఐ లక్ష్మన్న, కానిస్టేబుళ్లు కె.ఆదినారాయణ, కె. శ్రీనివాసులలకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి అభినందించారు.

ఆడ బిడ్డలను కాపాడుకుందాం


ర్యాలీ నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంఘాల నాయకులు, అధికారులు

రాయచోటి టౌన్ : స్త్రీ లేనిదే సృష్టి లేదు.. అందుకే ఆడ బిడ్డలను కాపాడుకుందామని స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ హైమావతి పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణంలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీగా వచ్చి బంగ్లా సర్కిల్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ ఆడబిడ్డల చదువు ...ఇంటికే వెలుగును ఇస్తుందన్నారు. స్త్రీ విద్యావంతురాలు అయితే ఆ ఇంటి ఆర్థిక పరిస్థితులేగాక అన్ని రంగాలు అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. బాల్య వివాహాలను నిర్మూలించాలని, ఆడబిడ్డలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. భ్రూణహత్యలు నియంత్రించి ఆడ శిశువులను కాపాడుకొనే బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. అంతకు ముందు బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రతిభ చాటిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరావు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రుషి వాటికలో డీఎంహెచ్‌ఓ విచారణ


సిబ్బందిని విచారిస్తున్న లక్ష్మీనరసయ్య

బి.కొత్తకోట : మండలంలోని రుషి వాటిక వేదవ్యాస పాఠశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి లక్ష్మీనరసయ్య మంగళవారం విచారణ జరిపారు. అక్కడ చదువుకొంటున్న లక్కిరెడ్డిపల్లె మండలానికి చెందిన విద్యార్థి శేషాద్రిరెడ్డి కుడి కంటికి గాయమై చూపు కోల్పోయిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసు కేసు నమోదైంది. ఇందులో భాగంగా కలెక్టర్ ఆదేశాలతో లక్ష్మీనరసయ్య ఆచార్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. గాయపడిన విద్యార్థికి ఘటన జరిగిన సమయంలో అందించిన వైద్య సాయంపై ఆరా తీశారు. రుషివాటికలో ఉన్న అత్యవసర వైద్య సదుపాయాలు, భద్రతా చర్యలను పరిశీలించారు. ఈ ఘటనలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలను సిబ్బందికి వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈ విచారణ నివేదికను కలెక్టర్‌కు అందించనున్నట్లు చెప్పారు. గాయపడిన విద్యార్థికి అవసరమైన వైద్య సాయం అందిస్తామని చెప్పారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ శ్రీధర్, టీబీ సూపర్‌వైజర్ ప్రభాకర్, ఆరోగ్య సిబ్బంది విజయలక్ష్మి, రెడ్డెమ్మ, ప్రమీల పాల్గొన్నారు.

వ్యాపారిపై టీడీపీ నాయకుడి దాడి

స్థలం వివాదంలో మున్సిపల్ మాజీ చైర్మన్ దౌర్జన్యం


టీడీపీ నాయకుడి దాడిలో గాయపడిన మోహన మురళీ

మదనపల్లె రూరల్ : స్థలం వివాదంలో ఓ వ్యాపారిపై టీడీపీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ కొడవలి శివప్రసాద్, దౌర్జన్యం చేసి దాడికి పాల్పడిన ఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. బాధితుడు మోహనమురళీ వివరాల మేరకు... అంకిశెట్టిపల్లె పంచాయతీ సురభీ కాలనీకి చెందిన మోహన మురళీ, బెంగళూరు రోడ్డులోని హంద్రీనీవా కాలువ సమీపంలో 1997లో 19 సెంట్ల స్థలం కొనుగోలు చేశాడు. మదనపల్లె మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు కొడవలి శివ ప్రసాద్‌కు స్థలం పక్కనే భూమి ఉంది. మంగళవారం మోహన్‌మురళీ తన స్థలంలో షెడ్ నిర్మాణానికి పనులు చేసుకుంటుండగా, కొడవలి శివప్రసాద్, అతడి బావ మరిది, డ్రైవర్‌తోపాటు అక్కడికి వచ్చారు. పనులు చేయవద్దని మోహన మురళీని అడ్డుకున్నారు. అయితే, తన వద్ద పూర్తిస్థాయిలో సరైన రికార్డులు ఉన్నాయని, పనులు ఎందుకు అడ్డుకుంటున్నారని మోహన మురళీ ప్రశ్నించాడు. అవసరమైతే స్థలం సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని, తన స్థలం ఉంటేనే తనకు వదిలేయాలని కోరాడు. అయినా వారు వినకుండా వాగ్వాదానికి దిగడంతో ఘర్షణ తలెత్తింది. ఆవేశానికి లోనైన కొడవలి శివప్రసాద్, అతడి బావమరిది, వాహన డ్రైవర్‌లు ముగ్గురు మోహన మురళీపై దాడికి పాల్పడ్డారు. దౌర్జన్యం చేయడంతోపాటు చంపేస్తామని బెదిరించారు. దాడిలో గాయపడ్డ మోహన్ మురళీ ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందాడు. ఘటనపై తాలూకా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేసి న్యాయం చేయాల్సిందిగా కోరాడు.

ఒంటరి వృద్ధురాలికి చేయూత

జడ్జి బాబా ఫక్రుద్దీన్ చొరవతో కదిలిన కుమారులు


లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ ఇస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్


కడప అర్బన్ : నలుగురు కుమారులు ఉన్నా.. ఒంటరిగా జీవనం సాగిస్తున్న ఓ వృద్ధురాలికి చేయూత అందించేలా కడప జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ చొరవ చూపారు. ఆమె కుమారులకు కౌన్సిలింగ్ ఇచ్చి.. ఆసరా కల్పించాలే చేశారు. కడప తారకరామా నగర్‌లో నివాసముంటున్న బుసల లక్ష్మమ్మకు నలుగురు కుమారులు, కుమార్తె ఉన్నారు. పెద్ద కుమారుడు బుసల రమణ కడపలో బేల్దారి పని చేస్తుండగా, ద్వితీయ, తృతీయ కుమారులు బుసల చిన్నప్ప, బుసల చంద్ర ఆటో నడుపుతున్నారు. నాలుగో కుమారుడు బుసల శ్రీనివాసులు కలకడలో టైల్స్ పని చేసుకుంటున్నారు. కుమార్తె బుసల రమణమ్మ కడపలో నివాసం ఉంటోంది. నలుగురు కుమారులు ఉన్నా.. ఆమె ఒంటరిగా జీవిస్తోందనే విషయం జడ్జి బాబాఫక్రుద్దీన్ దృష్టికి రావడంతో ఆయన స్పందించి లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులను ఇంటికి పంపారు. అక్కడికి వెళ్లిన న్యాయవాదులు ఆమెకు సాయం చేస్తామని తెలిపారు. అనంతరం జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ లక్ష్మమ్మ కుమారులు, కుమార్తెలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. వయో వృద్ధుల చట్టంపై వారికి అవగాహన కల్పించారు. పెద్ద కుమారుడు బుసల రమణ రూ.1500, ద్వితీయ, తృతీయ కుమారులు చిన్నప్ప, చంద్రలు ఒక్కొక్కరూ రూ.1500 ఇచ్చేలా ఒప్పందం కుదిర్చారు. ఆమె కుమారుల వద్దే ఉండేలా చూడాలని చెప్పారు. అనంతరం ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని వృద్ధురాలికి సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మనోహర్, రవితేజ సీనియర్ సిటిజన్ అయిన బుసల లక్ష్మమ్మ కుమారులు, కుమార్తె పాల్గొన్నారు.

టమాటా రైతులకు అన్యాయం


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

రాయచోటి టౌన్ : టమాటా మండీ వ్యాపారులను రైతులకు అన్యాయం చేస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి డిమాండ్ చేశారు. రాయచోటి సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ గుర్రకొండ మార్కెట్‌కు టమాటా దిగుబడులు తీసుకెళ్లితే వంద బాక్సులకు 20 బాక్స్‌లు జాక్‌పాట్ అంటూ పక్కకు తీసేస్తున్నారన్నారు. డబ్బులు చెల్లించకుండా మిగిలిన 80 బాక్స్‌లకు వేలం పాడి డబ్బులు ఇస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు చేస్తే తమ టమాటా దిగుబడులు కొనరేమోనని రైతులు భయపడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి మండి వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హరినాథ నాయుడు, అంజాద్ ఆలీఖాన్, నవీన్‌కుమార్ రెడ్డి, షబ్బీర్ బాషా, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


ఉపాధ్యాయునికి సూచనలు ఇస్తున్న డీఈఓ

పుల్లంపేట : విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని ఆదర్శ, కస్తూర్బా, బాలికల పాఠశాలలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించి ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ప్రయోగాలు ద్వారా బోధన చేయడంతో విద్యార్థులకు విషయం క్షుణ్ణంగా అవగతమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌ను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు చక్రధర్ రాజు, నాగ తిరుమలరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

పుల్లంపేట : మండలంలోని పాపక్కగారి పల్లి గ్రామంలో రైతు చిన్నారెడ్డి చంద్రమోహన్ రెడ్డి(48) మంగళవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఉదయం పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తూ మోటారు వేయడానికి స్విచ్ వేయగా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో రైతు అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. గుర్తించిన స్థానికులు మండలాధ్యక్షుడు ముద్దా బాబుల్ రెడ్డి సాయంతో రైతును ప్రైవేటు వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. తదుపరి ఎంపీపీ బాబుల్ రెడ్డి మృతుడి బంధువులతో కలిసి పుల్లంపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

మద్యం తాగి ఒకరు...

జమ్మలమడుగు : పట్టణంలోని ఎత్తపువారి కాలనీలో నరసింహులు(35) అనే వ్యక్తి మద్యం తాగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గత కొంత కాలంలో మద్యానికి బానిసై అతిగా తాగుతుండటంతో శరీరంలోని భాగాలు దెబ్బతిన్నాయని, దీంతో నరసింహులు చనిపోయారని తెలిపారు. బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న యజమాని మృతి చెందడంతో భార్య, అతడి పిల్లలు విషాదంలో మునిగిపోయారు.

వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల మేరకు సుబ్బరాయుడు అనే వృద్ధుడు ఇంటి సమీపంలో ఆడుకుంటున్న 8 సంవత్సరాల బాలికను ఇంట్లోకి పిలిపించుకొని అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

సూపర్ జీఎస్టీ–సూపర్ ఒత్తిడి!

సాక్షి ప్రతినిధి, కడప : ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లుగా 'సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్' కార్యక్రమం అధికారులను ముప్పుతిప్పలు పెడుతోంది. నిద్రలేచింది మొదలు జిల్లా అధికారులకు ఉన్నతాధికారుల నుంచి తీవ్ర ఒత్తిడి ఎదురవుతోంది. ఈ నెల 16న కర్నూల్ జిల్లా నన్నూరు వద్ద నిర్వహిస్తున్న ప్రధానమంత్రి కార్యక్రమానికి ఎంతమందిని తీసుకొస్తున్నారు. వారిలో పారిశ్రామికవేత్తలు ఎంతమంది ఉన్నారు? ఏయే వాహనాల్లో వస్తున్నారు? వాహనాల నంబర్లు ఏమిటి? వ్యాపారులు ఎంతమంది వస్తున్నారు? చిన్న తరహా పరిశ్రమల నిర్వాహకులు ఎవరెవరు వస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలతో జిల్లా కేంద్రాలల్లోని అధికారులను రాష్ట్ర ఉన్నతాధికారులు ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.

జీఎస్టీ టారిఫ్‌లు తగ్గిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ విషయమై ఇదివరకే జిల్లా నుంచి మండల స్థాయి వరకూ వివిధ కార్యక్రమాలను చేపట్టారు. వాటి నిర్వహణ ప్రధానంగా లేబర్ డిపార్టుమెంట్, పరిశ్రమల శాఖ, పంచాయితీరాజ్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. జిల్లా కేంద్రంతోనే సరిపెట్టకుండా నియోజకవర్గం, మండల స్థాయిలో కూడా నిర్దేశించిన కార్యక్రమాలు కొనసాగించాలని సూచించారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొంటున్న బహిరంగసభ విజయవంతం చేయడంపై ఉన్నతాధికారులు దృష్టి సారించారు. ఉమ్మడి కర్నూల్ జిల్లాకు పరిమితం కాకుండా రాయలసీమ జిల్లాల్లోని అధికారులకు టార్గెట్ పెట్టి సమీకరణ చేపట్టాల్సిందిగా ఉన్నతాధికారులు వేధింపులకు గురి చేస్తున్నారని వాపోతున్నారు.